# ఒకకథ

‘అజ్ఞాత్’

౮-౧-౩౯
బొంబాయి.

“ఇప్పటికి సరిగా వారంరోజు లయింది మిమ్మల్నందరిని వదిలిపెట్టి. ధర్మవరం దాటగానే నాకు వెనక్కి తిరిగి ఇంటి కొచ్చెయ్యా లనిపించింది. కాని దాసు చాలా ప్రోత్సాహించాడు మళ్లా. అంచేత అంత బెంగలేకుండా ఇక్కడి కొచ్చాను.

నిన్ను చూచిచూచి రావడానికి కాళ్లాడలేదు. కాని లక్ష్మీ, భగవంతునిదయ యుంటే, ఏమో మనం అనుకున్నట్టూ ఈయారునెల లయినతరువాత సర్కారు ఓపదెకరా లిస్తే! ఇస్తారుట ఎల్లాగైనా ఆఖరికి నాలుగైనా. ఏమో మనకల లన్నీ నిజ మవుతాయేమో? హాయిగా కూర్చుని పండించుకోవచ్చు. పిల్ల లదృష్టం. ఇప్పుడేగదూ ఈరాత్రనక పగలనక ఈకష్టం. యుద్ధమా మాట్లా? తరవాత రోజులన్నీ మనఇష్టం. గువ్వల్లా గూట్లో పడి ఆకాస్తగింజలూ పండించుకోవచ్చు.

పిల్లలు కళ్లల్లో కట్టినట్టున్నారు. నేను బయలుదేరేటప్పుడు కారు కదిలేవరకూ నీముఖం చూడడానికి ధైర్యం లేకపోయింది. నివ్వెంత దుఃఖ మాపుకున్నావో నాకు తెలుసును. ఏం చేస్తాం. బెంగపెట్టుకోకు. కోత లవంగానే తిరిగీ వచ్చేస్తా. దేవు డిచ్చిన ఆయుస్సు తిన్నగా వుంటే మన కేం భయంలేదు.

చేను జాగ్రత్తగా చూచుకొంటూండు. రాముణ్ణి నూతిదగ్గిర ఆడుకోనివ్వవద్దు. అమ్మనీ పిల్లల్ని ఎంత భద్రంగా చూచుకొంటావో. ఓడ ఎక్కగానే వ్రాస్తా మళ్లీ. అమ్మకి దణ్ణాలు.”

ఉత్తరం చదివించి విన్నది. అత్తగారితో పిల్లలిద్దరూ వాకిట్లో ఆడుకుంటున్నారు. గుమ్మంలోకి వచ్చింది లక్ష్మి కష్టంగా రింటినుంచి. కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. రాముడివేపు చూచింది. రాముడు కనబడలేదు. నీళ్లడ్డం. రాముడు చిన్నిముఖం ఎత్తి పలుకరించాడు:

“అమ్మా, నాన్నెప్పుడొత్తాడే? నాక్కక్కబండి తెత్తాడా?”

లక్ష్మికి యేడుపాగలేదు. రాముడు తల్లికాళ్లు చుట్టేసుకున్నాడు.

*       *       *       *

కోడి కూసింది—మలుకోడి.

లక్ష్మి యథాప్రకారం లేచింది. రాత్రంతా ఏమేమో కలలు: ఒకదానికీ తెన్నూ లేని ఊహలు. ఒకళ్లనొకళ్లు చంపుకోడం, రక్తప్రవాహాలు, గుఱ్ఱాలు, పెద్దపెద్ద ఓడలు, రైలుబండ్లు. నారాయణా తానూ చేలో కలిసి కలుపు తీస్తూ ఎందుకో పకపక నవ్వేశారట. ఇంకా చాలా. అర్థం లేదు.

మంచుతో బరువుగా చిన్నిగాలి వీస్తోంది. రాత్రి ఒకజల్లు కురిసి ఆగినట్టుంది వాన. వాకిలి కొంచెం చెమ్మగా వుంది. వెన్నెల. లక్ష్మి ముఖం కడుక్కొని చల్లచేసుకుంది. గొడ్ల సావిట్లోకి వెళ్లి పని చేసుకుంటూంది. తెల్లవాస్తోంది తూర్పున. ఇప్పటికి పదిహేనుసార్లు ఈవిధంగా తెల్లవారింది నారాయణ పటాలంలోకి వెళ్లిన తరువాత. ఇన్నిరోజులకీ ఈనాడు ప్రొద్దున్నమాత్రం హృదయం కాస్త భారం తగ్గినట్టుంది లక్ష్మికి. ఆరుమాసాలేగదూ. ఆరమావాస్యలు, ఆరుపున్నాలు. అంతే. యెర్రావు ఈనేటప్పటికి తిరిగి రావాలి మరి. అదృష్టం వుంటే పుల్లావూ కోడెదూడ్ని కూడా వెయ్యాలి. లక్ష్మిభావాలు పరిగెడుతున్నాయి. పాలు తీసి లేగల్ని విప్పింది.

తూర్పున దేవుడికి దణ్ణం పెట్టి, పిల్లలకి అన్నం పెట్టి తలలు దువ్వి చొక్కాలు తొడిగి బరిలోకి పంపేసింది.

అత్తగారు లక్ష్మి చద్దన్నం పెట్టుకున్నారు. సోమవారం, ఓడలోనుంచీ వ్రాసేవుత్తరం వస్తుందని చెప్పుకున్నారు, ఇద్దరూను.

ఆనాడు లక్ష్మి చేలోకి వెళ్లింది. ప్రతిరోజూ కంటే ఆనాడు కొంచెం సంతోషంగానే వుంది. కాని ఈపదిహేను దినాలనుంచీ వున్న వెలితి మాత్రం పోలేదు.

ఊడ్చినచేనంతా నాటుకుంది. ఈచేను పెరిగి పండేటప్పటికి నారాయణ తిరిగి వస్తాడు. వేసవి అంతా ఇంటోనే వుంటాడు. ఆతరువాతకూడాను. ఈతలంపుతోనే ఒకవిధమైన ధైర్యంకూడా వచ్చింది లక్ష్మికి.

ఆకులు పోసినవెంటనే వెళ్లాడు నారాయణ.

లక్ష్మి తల్లిలేని దవడంవల్లనున్నూ మేనరిక మవడంవల్లనున్నూ పెండ్లి అయినతరువాతా, అవకముందూ కూడా ఆ ఇంటోనే పెరిగింది, నారాయణ దగ్గరగా. ఇన్నాళ్లు వరసాగ్గా కళ్లకి కనబడకుండా వుండడం పెండ్లి అయిన తరువాత ఇదే మొదటిసారి నారాయణ, ఈ యెనిమిదిసంవత్సరాలకీ. భర్తవైపున బంధువులు అసలే లేరు లక్ష్మికి. అంచేత తానే నడుం కట్టుకుని ఆకు తీయించి ఊడ్పించింది. లక్ష్మితండ్రి దూరాన్నున్నాడు. పండుగలకు వచ్చి పోయేవాడు.

నారాయణ తనంతట తానే అయితే వెళ్లకనే పోనేమో. కాని అతనిబాల్యస్నేహితుడు దాసు ప్రోత్సాహం జాస్తి ఆయింది. దాసు బలగం గలవాడు. బ్రహ్మచారి. వీళ్లకంటే కాస్త బాగా బ్రతుకుతూన్నవాళ్లు కూడాను. గడచిన పదిసంవత్సరాలలో సంతకు బస్తీ వెళ్లడంతప్ప మరేమీ బయట పని లేని నారాయణకి పటాలం కొలువంటే కాస్త సరదాగానే వుంది. యుద్ధం లేనిరోజుల్లో ఒకపుడు పటాలంలో చేరి వచ్చే సొదకూడాను. అదికాక పటాలం పనివాళ్లందరికి తిరిగి వచ్చాక పొలాలిస్తారనే ఆశ ఒకటి.

మరునాడు తలంటిపోసుకొని లక్ష్మి శనివారం చేసుకుంది. సోమవారానికి ఒక్కరోజే మధ్య వుంది.

ఆ రెన్నాళ్లూ రెండు గడియలలా గడిచినాయి.

సోమవారం: ౧౪-౨-౩౯

"మేము ఓడలో వున్నాం. మన తెలుగుభాషరాని వాళ్లు కూడా చాలా మంది మా ఓడలో వున్నారు. నాకే విధమైన లోటూ కనబడడం లేదు. చాలా సరదాగా ఉంది. ఒహఆటలూ, ఒహపాటలూగావు. అన్నీ తిరిగి వచ్చాక చెబుతానులే.

"పిల్లల మీద మాత్రం చాలా బెంగగా ఉంది. మరీ రాముడు కళ్లల్లో తిరుగుతున్నాడు. వాడు జాగ్రత్తి సుమా."

ఉత్తరం వచ్చింది. ఏమిటో ఆ సరదా లక్ష్మికి అర్థంకాలేదు. ఇహ తరుచు ఉత్తరాలు వస్తూవున్నాయి.

౨౩-౪-౩౯ బస్రా.

"మా పటాలం ఇక్కడే దిగి పొమ్మన్నారు. మాతోపాటు ఇంకారెండు రెజిమెంట్లు దిగాయి. దాసు బాగానే ఉన్నాడు. ఏమీ పని లేదు. రోజూ కవాతు చేయిస్తారు మాచేత. అది అయినతరవాత కోరినతిండి, పేకాట. ఒక్కొక్కప్పుడు ఊళ్లోకి వెళ్లి నాలుగు వీధులు తిరగడం. బలేగా ఉంది."

మనస్సులో బాధగా ఉన్నా లక్ష్మి ఆ ఉత్తరాలు చూసుకొని ధైర్యం తెచ్చుకుంది. ఆయన సుఖంగా ఉన్నదీ లేనిదీ తెలుస్తోంది. అంతే చాలు.

పొరుగింటి పిల్లల్ని చూసి లక్ష్మిపిల్లలు గోల పెడుతూంటే వాళ్లకు కూడా కుడుములు చేసి యిద్దామని చేసింది. ఆఖర్ను తనూ ఒకటి తీసుకొంది. నారాయణకు చాలా యిష్టం కుడుములంటే. తలవని రీతిగా తలంచుకుంది. కుడుము నోట్లో పెట్ట బుద్ధి వెయ్యలేదు.

ఇంకా నారాయణదగ్గరనుంచి ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి.

లక్ష్మి విన్నదీ ఉత్తరం. హృదయంలో గాయం పడ్డది. ఇంటికొచ్చింది:

౧౦-౮-'౩౯

బ్రసా

"యుద్ధం ఆరంభం అయింది. మా రెజిమెంటు ఈ రాత్రి పన్నెండు గంటలకు బయలుదేరాలి."

"అబ్బ! ఎన్నెన్నో కొత్తకొత్త మరతుపాకీలు తెచ్చారు. నిన్నంతా మాకు చూపించారు. మొహాలకి గంతలు ఎన్నోరకాలు. ఈవింతలన్నీ తిరిగి వచ్చాక చెబుతాను."

"నిన్నంతా నువ్వే కనపడ్డావు కళ్ళకి"

"అమ్మా పిల్లలూ జాగ్రత్త! రాముడు జాగ్రత్త సుమా"

లక్ష్మి పనంతా చేసుకుని తీరికగా ఉన్నప్పుడు కర్ణంగారి వాకిట్లోకి పోవడం కద్దు. కరణంగారి భార్య రంగమ్మగారు, చాలా మంచిది. నలుగురూ కలిసి కాస్త ముచ్చట్లాడుకొని నీళ్ళవేళకి ఇళ్లకు జేరుకుంటారు. ఈ సంవత్సరం రంగమ్మగారి పెద్ద బ్బాయి రామ్మూర్తి చెన్నపట్నంలో ఓయ్యే పాసై ఇప్పుడింటోనే ఉన్నాడు. ఇంగ్లీషున్యూస్ పేపరు తెప్పిస్తూంటాడు. చదివి ఎప్పటికప్పుడు రంగమ్మ గారితోను తండ్రిగారితోను చెబుతూంటాడు వాట్లల్లో సంగతులు. వాట్లల్లో భయంకరమైన మరతుపాకీలు, శిథిలమైపోయిన పట్నాలు, శత్రువులు ధ్వంసం చేసిన కట్టడాలు, మరణిస్తూ ఉన్న సిపాయీలు—వీట్ల అన్నిటి బొమ్మలూ చూపించి అర్థంచెబుతూంటాడు.

నారాయణవుత్తరాలన్నీ ఆయనే చదివి చెప్పేవాడు లక్ష్మికి. లక్ష్మికి అక్షరజ్ఞానం లేదు.

నారాయణవుత్తరం తిరిగి వచ్చేవరకూ అదే కాలక్షేపం లక్ష్మికి. రంగమ్మగారి ద్వారా యుద్ధ సమాచారాలు తెలుసుకోడం, ఆబొమ్మలాశ్చర్యంగా చూస్తూండడం; ఇదీ వరస.

౨౦-౮-'౩౯

బ్రసా

"ఇన్నాళ్లూ ఈతాగుడు ఎల్లా తాగేనో, ఇప్పుడు అసహ్యావేస్తోంది. ఈఅన్నం మనగొడ్లుకూడా తినవు. ఈబ్రతుకు బ్రతికేకంటే చస్తే మేలు. తాగడానికి నీళ్లుకూడా దొరకడం లేదు. దోమలు వీపు మీద ఒకగేదెబరువు. ఏదో పాపం చేస్తే తప్ప యుద్ధంలోకి రారు."

తప్పంతా తనదే ననుకుని దృఢం చేసుకొంది మనస్సులో. తానే వెళ్లనిచ్చింది. ఒంటరిగా. అంత దూర దేశం. ఏడవకూడదూ? చిన్నా పెద్దచే చెప్పించ కూడదూ? నారాయణ పెద్దమనిషి. పెద్దలమాట కెదురుచెప్పడే! అయినా తనపూర్వజన్మప్రాలుబ్ధం అంతేనేమో! ఇంకా ఎన్నో తలంపులు వచ్చాయి ఆరాత్రంతా. నిద్రపట్టలేదు. నారాయణ సుఖంగా తిరిగి వస్తే ఒక మేకపోతును మొక్కుకుంది మహాలక్ష్మి అమ్మవారికి.

౩౦-౮-'౩౯,

బ్రసా.

"గడచిన రెండుదినములూ ఘోరమైన యుద్ధం చేశాము. ఇటువంటి ఘోరం యమలోకంలోకూడా ఉండదు. నీవు ఊహించుకోలేవు. నాహృదయాన్ని చంపుకున్నాను. యుద్ధానికి ఎందుకొచ్చానా అని పరితపిస్తున్నాను. నేను వెంటనే తిరిగి మీఅందరినీ చూచే వరకూ ప్రాణాలు కుదురుగా ఉండవు."

"అమ్మ ఏడుస్తోందా?"

౧౦-౯-'౩౯,

బ్రసా.

"నాకు మతి పోతోంది. పదిమైళ్లు ముందుకి సాగాం. నిన్నంతా మురికినీళ్లలో, కందకంలో శవాల మధ్య ఉన్నాము. నాకు ప్రాణస్నేహితు లందరూ చస్తూంటే వాళ్ల కేకలు వినికూడా వాళ్లమీదనుండి ముందుకు నడిచిపోయాం. హృదయం రాయిచేసుకొన్నాను. తోటివాళ్లందరూ గాలిలో పురుగుల్లా కనిపించవలసివచ్చింది. కన్నుమూసి తెరిచేటప్పటికి కెవ్వున కేకలుపెట్టి చుట్టూ కూలిపోతున్నారు. ప్రాణంతో సమానంగా చూసుకొన్న స్నేహితుల్ని ప్రాణం పోకముందే వదలి ముందుకు పోవలసివస్తోంది ఏఘడియ కేమో?"

౨౦-౯-'౩౯,
బ్రసా.

"నే నింకా బతికే ఉండడం నాకే ఆశ్చర్యంగా ఉంది. నాకు మతిపోయింది. నాకీపాపం ఇష్టంలేదు. ఇక్కడ చస్తే వీరస్వర్గం అంటారు. నాకు నమ్మకం లేదు. నన్ను డిశ్చార్జిచేస్తే బాగుండును. మీ అందరి లోకి వచ్చి పడిపోతాను."

ఈ ఉత్తరాలు విని లక్ష్మి చాలా దిగులుపడింది. ఆయన బయలుదేరేటప్పుడు కాళ్లమీద పడి భోరున ఏడ్చినట్లయితే వెళ్లకపోనేమో? ఎందుకు అంత ఏహ్వా ఆపుకొన్నాను అని చాలా విచారించింది. నల్లని మబ్బు కమ్మినట్టు మనస్సుని విషాదం కమ్ముకుంది. చేను పచ్చమూన వేసింది. రోజులు గడుస్తూన్నాయి. ఒకనెల వుత్తారాలు లేవు.

లక్ష్మితండ్రి కన్నయ్య పదిమైళ్ళదూరంలో వున్న మంగళూరుబస్తీలో వున్నాడు. ఏదో శని పట్టినట్టు ఒకఆరుసంవత్సరాలు వరసాగ్గా పంట సరిగా పండక కాస్తభూమీ పెట్టుబడి పెట్టిన షాహుకారికి విక్రయించేశాడు. భుక్తి జరిగేమార్గం లేదు. పాలి కాపుగా ఎవ్వరికైనా పనిచెయ్యడానికి పువ్వులమ్మిన వూళ్లో కట్టె లమ్మిన ట్టనిపించిం దాతనికి. అందువల్ల వూరు మారి బుచ్చిరాజుగారి దివాణంలో పంకా లాగడానికీ కూరలు తేవడానికీ నాల్గురూపాయిల జీతానికి నౌఖరీ కుదిరాడు. ఆవిధంగా ౨౦ సంవత్సరాలు చేశాడు. బుచ్చిరాజుగారు కాలంచేశారు. ఆయన అల్లుడు దివాణాని కధికారై చాలామంది నౌకర్లపన్లు తీసివేశాడు. కోచిమాన్‌లిని గుర్రపువాళ్ళని తీసి Motor కార్లు కొన్నాడు రెండు. పంకావాళ్ళని తీసి Electric పంకాలు నవనాగరీకంగా పెట్టించాడు. ఇల్లాగే అన్నీ. ఆసందర్భంలో కన్నయ్యనౌకరీ కాస్తా పోయింది. కాని చాలాకాలం ఇల్లు కనిపెట్టుకున్నాడనీ బాగా ముసలివాడనీ బుచ్చిరాజుగారిభార్య వాళ్ళదొడ్లో పువ్వులచెట్లూ అవ్వీ వుండగా కాస్త మెల్ల వుంటే దానిలో ఉచితంగా పాకా వేసుకుని బ్రతకమని హుకుం ఇప్పించింది. కన్నయ్య ౮ ఆవుల్ని కొని పాలవర్తకంవల్ల జీవిస్తూన్నాడు. బ్రతుకు సుఖంగానే వుంది. మంగళూరు చాలా పెద్దబస్తీ, పాలకి ఖర్చు జాస్తి. తిండికీ బట్టకీ వెలితిలేకుండా జరుగుతూంది.

ఓనాడు కన్నయ్యకి జబ్బుచేసింది. విషజ్వరం. బాగా పెద్దవాడైనందున తిప్పుకో లేకపోయాడు. మనుమల్ని కూతుర్ని ఒక్కమాటు చూచి వున్నవాల్లు దూడల్ని కంచరిసామానూ వప్పజెప్పి బాధ్యత వది లించుకోవాలని దివాణంగుమాస్తాగారిచేత వుత్తరం ఒకటి వ్రాయించి పంపిచాడు లక్ష్మికి, వెంటనే బయలుదేరి రమ్మని.

ఎప్పటిలా కర్ణంగారింటికి తీసికెళ్లింది లక్ష్మి వుత్తరం రామ్మూర్తిగారు చదివి చెప్పారు.

చేలో ఒకనెలవరకూ అట్టే పని వుండదు. అందువల్ల పక్కింటివారిని బతిమాలి విషయం చెప్పి చెల్లమ్మఅనుమతి పుచ్చుకుని చిన్నపిల్లల్ని ఇద్దర్ని తీసుకుని బయలుదేరింది మంగళూరు లక్ష్మి. ఆనాడు కర్ణంగారి వెట్టి ఎంకడు మంగళూరు తాలూకాఆఫీసుకు వెడుతూంటే వాడివెంట వచ్చింది. భద్రంగా పడవ దాటించి, కన్నయ్యపాకలో ఒప్పజెప్పి వెళ్లాడు వెట్టి.

తండ్రి కూతురు చూచుకుని ఏడ్చినారు. నారాయణ పటాలంలోకి వెళ్లడం కన్నయ్యకి అంత ఇష్టం లేదు. తనకూతురుబ్రతు కేమవుతుందో అని దిగులుగా వున్నాడు. పిల్లల్ని దగ్గిరికి పిల్చి ముద్దులాడాడు.

రెండవనాడు,కన్నయ్యకు మందిస్తున్న సాతాని తాత, నమ్మకం లేదని చెప్పాడు లక్ష్మితో. లక్ష్మికి జీవితంలో తండ్రితో ఎక్కువ కలిసి బ్రతకకపోయినా అదేదో కొండంత ధైర్యంగా వుండేది తండ్రి వున్నాడంటే. అదీకాక తనతండ్రి అని ఎవ్వరిని పిలిస్తే కడుపు నిండుతుంది?—ఇంతగా. అతిచిన్నతనంలో తల్లిని మరిపించి పెంచాడు కన్నయ్య కూతుర్ని, తరువాత దూరంగా మేనమామగా రింటో ఇచ్చేశాడుగాని. బుచ్చిరాజుగారి భార్య కాశీకి వెళ్లారు. ఊళ్లో లేరు. ఆమె వున్నా ఏఇంగ్లీషు డాక్టరునైనా పిలుపించునేమో, గొప్పమందు లిప్పించునేమో. ఇప్పుడు ప్రపం

చంలో తన్ని కాపాడి రక్షించ గలిగినవాళ్లు ఎవ్వరూ లేరు కన్నయ్యకి. కూతుర్ని చూచి నిశ్శబ్దంగా కన్నీళ్లు కార్చాడు.

పటాలాల్లోకి వెళ్లినవాళ్ల సంగతి కొంతవరకు పెద్ద వాడుగనక కన్నయ్యకి అనుభవం. వాళ్లభార్యా పిల్లలు పడుతూన్న కష్టాలకు గుండె నీరయిపోయేది కన్నయ్యకి పిల్లల్ని తల్లినీ చూస్తొంటే. కాని లక్ష్మికి తెలుసు. నారాయణ తొందరలో వస్తాడని. తండ్రిది వట్టి వెఱ్ఱి ప్రేమ. జ్వరతీవ్రత అని అనుకుంది.

మూడవనాడు, అమావాస్య తగిలింది.కన్నయ్య క్రొత్తసంగతులు మాట్లాడుతున్నాడు. క్రొత్తమనుషు లని పలకరించాడు. సంతోషంగా నవ్వాడు. సంధి!

లక్ష్మికి దిక్కు లేదు. నారాయణ దూరా న్నున్నాడు. దివాణంలో వున్నవారికి ఈ పల్లెటూరిపిల్ల వింత, హాస్యం. ఎవ్వరూ పలుకరించరు హృదయ పూర్వకంగా. ఈపిల్లని ఎరుగరు వాళ్లెవ్వరూ. కన్నయ్య వీళ్లకొలువులోకి రాడానికి రెండేండ్ల ముందే పుట్టింది — తండ్రి నడివయసులో. ఈవూ రెరుగదు. ఈనీరు లెరుగదు. ఈప్రజ నెరుగదు.

నిండు అమావాస్యనాడు కన్నయ్య రెండుగంటలు కలతలేని నిద్ర పోయాడు. లక్ష్మికి మనస్సు కుదుటపడ్డది. ఈవిధంగా జబ్బు నిమ్మళిస్తే చాలు ఎన్నాళ్లకి లేచి తిరిగితేం? ప్రాణం వుంటే బలుసాకు ఏరుకుని బ్రత కొచ్చు. ఇది తేలేక ఇక్కడ ఒంటరిగా బ్రతకనివ్వను. నయానా భయానా చెప్పి మాఇంటికే తీసుకు పోతాను. 'కళ్లముందుంటాడు. ఇక్క డెవ్వరూ? అండ లేనిచోట వుండ దోష మన్నారు పెద్దలు. ఇప్పుడు తప్పదుగా. ఈజబ్బు తేలేవరకూ కదలకూడదు. తేలిన వెంటనే, బయలుదేరాలి. ఈతలంపులతో, తూర్పున తెల్లవారినట్టూ, ఆనందం తొలకాడింది లక్ష్మిముఖం మీద. తాను కాచిన బార్లీగంజి చల్లార్చి నెమ్మదిగా లేపింది. 'అయ్యా లె' మ్మని.
అయ్య పలుక లేదు.

నుదుటిమీద చెయ్యివేసి లేపింది. నుదురు చలు వరాయిలా తగిలింది చేతికి. చైతన్యం లేదు.

* * *

ఈ ఆవుల్ని ఈసామానువిషయం ఏదో తేవుల్చు కునే వరకూ లక్ష్మి మంగళూరు విడువలేకపోయింది. వీల్లేదు ? దివాణంవారు కన్నయ్య అంత్యకర్మలకు అయిన ఖర్చుక్రింద వాళ్లవద్ద కన్నయ్య దాచుకున్న సొమ్ములో సగం మినహాయించుకున్నారు. అందువల్ల దివాణంవారిమీద ఎంత అసహ్యం వేసినా లక్ష్మి వా ళ్లతో పేచీ వదులుకుంటేగాని కదల్లేకపోయింది. పైగా ఆవుల్ని ఆశుక్రవారం సంతకి పంపించి పోక దల పెట్టాలి. లేకపోతే ఆవుల్ని ఎల్లా తోలుకెళ్లడం అంతదూరం ? ఈఆస్తి విడిచిపెట్టి తిరిగీ వెళ్లిపోదా మాఅంటే, కన్నయ్య 'వియులు' (Will) వ్రాసివుం చాడు ౨ సంవత్సరాలక్రితమే – కూతురుకేనని — లేక కూతురుపిల్లలికనీ. తన కవసరం లేకపోతే పిల్లలికో- పిల్లల నోటిదగ్గరనుంచీ తియ్యడం ద్రోహం. గుండె నిలుపుకుని ఈవారం ఇక్కడే వుండి తేవుల్చుకుని వెళ్లాలి. పోయిన తండ్రికొరకు గొల్లోలుపెట్టి ఏడ్చింది. తల తిరిగిపోయింది.

ఓవారం గడిచింది. దివాణంలో దాసీలు రోజూ పని తీరికయినప్పుడల్లా వచ్చి పలుకరించేవారు. నీభర్త ఎక్కడ ? నీ కెంతమంది పిల్లలు ? అని తోచిన ప్రశ్న లన్నీ వేశారు. విచారంలో వుండి పటాలంలో వున్నాడని ముభావంగా చెప్పి తనపని తాను చూచు కునేది. పట్టణాలలో దుష్ప్రవర్తన కలవాటుపడి శీలం పోయిన కొంతమంది దాసీలు, లక్ష్మికి భర్తవిషయం చెప్పటం ఇష్టం లేదని భావించుకున్నారు. వాళ్లల్లో వాళ్లు తర్కంలోకి దిగారు, భర్త విడిచిపెట్టి వెళ్లాడు అని నిశ్చయించుకున్నారు. ఈదాసీల భోగట్టాలు అంతఃపురం చేరినాయి. బుచ్చిరాజుగారి భార్యకీ బుచ్చిరాజుగారి కుమార్తెకూ చాలా భేదం వుంది. ఈమె వివేకంలేని స్త్రీ. దాసీలు చెప్పినమాటలు నమ్మి నవ్వింది. హృదయం లేదు. మంచి చెడ్డ వివక్షత తెలి యదు. తనవినోదంకోసం లక్ష్మిని కబురుపెట్టి పిలి పించింది. క్రమేపీ దివాణంలో మగనౌకర్లదాకా పాకింది ఈ లక్ష్మికి భర్తలేడనీ, లక్ష్మి భర్త అధీనం లో లేదనీ. లక్ష్మి నీళ్లకి వెళ్లినప్పుడు మగవాళ్లు వెకిలి నవ్వులునవ్వారు. కిచకిచమని చెప్పుకున్నారు.

ఒకవూరు కాపు ఒకవూరు వెట్టి అన్నట్టు ధర్మవరంలో నారాయణభార్య, ఇళ్లాలని గౌరవంగా బ్రతికిన లక్ష్మి ఈవేళ దిక్కులేని దానిలా అందరి వెకిలి చూపులకు హాస్యాలకి గురి అయ్యింది. లోటు తనదీ కాదు. లక్ష్మికి ఈప్రజల ప్రవర్తనలు చాలాకాలం పరిశీలనం లేదు. కాని రోజు పైబడ్డకొద్దీ లక్ష్మిమనస్సు కలతపడుతూంది. వీళ్ల కామెమీద కలిగిన తేలికదనానికి కారణం తెలియదు. పట్టణపుప్రజ ఇంతేకాబోలనుకుంది. తనకు తెలిసిన పట్టణప్రజ అంతే. సాధ్యమైనంత తొందరగా ధర్మవరం వెళ్లిపోవాలని నిశ్చయించుకుంది.

ఆనాడు కోడికూతకి మెలుకువ వచ్చింది లక్ష్మికి. తనమామూలువాడు కదా. పైగా ఇది క్రొత్తవూరవడం వల్ల మరీనిద్ర సరిగ్గా పట్టడమే లేదుగూడాను. దివాణం దొడ్లో చిన్నమాటలు వినిపించినాయి. లక్ష్మికర్థం కాలేదు. పిల్లల్ని దగ్గరగా లాక్కొని మళ్లీ పడుకుంది. తెల్లవారేవరకూ బస్తీలో ఏంపని వుంటుంది? —అందులోనూ, లక్ష్మివున్న పరిస్థితుల్లో? వుదయాన్న ఇద్దరు ముగ్గురు దాసీలొచ్చి అతిగర్వంగా అమ్మగారు పిలుస్తున్నారని చెప్పారు. వెళ్లింది. వెళ్తోంటే దారిలో "ఇదే, ఇదే, దొంగ" అన్నమాటలూ నవ్వులూ వినిపించాయి. "300 రూ. బంగారుగొలుసు పోయింది. నీవుతప్ప ఈ ఆవరణలో క్రొత్తవాళ్లు లేరు. ఎవ్వరూ రానూలేదు. పైగా రాత్రి నీగుడెసె వైపు, అరటిచెట్లుక్రింద నిన్ను మా పెద్దగుమస్తా చూశాడట. అంతరాత్రి నీవు కాంపౌండులో ఎందు కుండవలసి వచ్చింది? కనుక పోలీసుకు కబురుపెడతాను. నిజం తప్పకుని తెస్తావా తెచ్చి ఇయ్యి గొలుసు, లేకపోతే చూచుకో. మరి నీయిష్టం. ఆవులూ దీవులు అమ్మి గొలుసుఖరీదు తీసుకుంటాం. పైగా ఎన్నాళ్లైనా సర్కారు ఖైదువేస్తే, పిల్లలకి ఎడ మవుతావు. ఏం ఏం చెబుతావు?" అని వినిపించింది లక్ష్మికి మేడ ఎక్కగానే. అమ్మగారు గర్జించింది. లక్ష్మికి కాళ్లక్రింద భూమి తిరిగిపోయింది, నోట మాట రాలేదు. ఏదో నూతిలో వున్నప్పుడు పైనున్న వాళ్లమాటలువినిపించినట్టు "ఈవేళ గడువిస్తాం సాయంత్రం లోపుగా ఇవ్వకపోతే రేపు పోలీసుస్టేషనుకి వెళుతావు సరే. పో. ఇక వెళ్లు ఆలోచించుకో" అని వినిపించింది. కాస్సేపటికి లక్ష్మి తనకు తెలియకుండానే నడిచి వచ్చింది తండ్రి పాకలోకి. తన కేమీ అర్థం కాలేదు. తండ్రిలేని కొరత చెప్పలేనంతగా కనిపించింది. ఏం చెయ్యగలదు? ఒక్కతె ఆడుది. తెలియని మూక. తన వూరు గాదు తనపల్లె గాదు. భర్త దూరాన వున్నాడు. మగ దిక్కులేదు. బ్రతుకు దుర్భరంగా కనిపించింది. ఏది ఈ కల్లోలంలోనుంచి తప్పించుకునే మార్గం? ఎవరు తప్పిస్తారు? ఎందుకు ఈదుస్థితికి రావాలి? ఎల్లాగైనా దేనిలోనైనాపడి, కళ్లు మూసుకుంటేనో? అమ్మో! పిల్లలో! ముసలమ్మో!

పిల్లలు తల్లిదుఃఖం చూచి వెర్రిపట్టినట్టేడుస్తున్నారు. సాయింత్రం అయింది. దివాణంనుంచి పెద్దకారు బయలుదేరి యజమానులనిద్దర్ని ఎక్కించుకు వెళ్లింది రైలుస్టేషన్‌కి. మరిరెండు కార్లు ఎదురు వెళ్లినయ్. పెద్దమ్మగారు కాశీనుంచి వచ్చేరోజు ఈవేళ. వచ్చారు.

ఈ తగాయిదా ఆమె చెవిలో వేశారు పెద్ద వంటవాడూ దాసీలూ. లక్ష్మిని పిలిపించ మన్నారు అమ్మగారు. ఈలోపుగా స్నానం చెయ్యడానికి వెళ్లితే ఆమెకే గంగాళంలో నీళ్లల్లో అడుగున గొలుసు మెరుస్తో కనిపించింది. లోపలి కెళితే తలుపుమూల ఆదుర్దాగా నక్కాడు వంటవాడు. ఆమె చూచి నిజం చెప్పమంది. చెప్పాడు. పనిలోనుంచి తీసేశారు. కుమార్తెను గద్దించారు. లక్ష్మిని ఓదార్చి, రెండుచీరలు పెట్టి, కన్యయ్యసామ్యంతాను, ఆవుల్ను ధరలు కట్టి మరోపదిరూపాయలు ఎక్కువవేసి పంపించారు పెద్దమ్మగారు, బంట్రౌతుని పడవవరకూ వెంట ఇచ్చి.

ఇవతల వడ్డున దిగేటప్పటికి తూర్పు తెల్లపడుతూంది. ఈగడచిన నెలరోజుల చర్యా ఒకపెద్ద పీడకలలా కనిపించింది లక్ష్మికి. స్వప్నంలో తిరిగొచ్చినట్టు వింతనడక జరిగింది. లక్ష్మి తను ఎప్పుడూ అనుకోని సంగతి. ఎప్పుడూ ఎరుగని అనుభవాలు. మరియొక ప్రపంచంతో సంబంధం. జీవితమే వింత. ఇది కల కాదు. చేతిలో బిళ్లకుడుముల్లా ౨౦౦ పైగా రూపాయి

లున్నవి. తన ఆస్తి. తండ్రి తన కిచ్చినది. తాను తన పిల్లలికి దాచవలసినది. మూట భద్రంగా చూచుకుంది.

అదృష్టంకొద్దీ, తిరుగుబండ్లు ధర్మవరంవి కని పిస్తే వాట్లల్లో ఎక్కి ధర్మవరం చేరింది. చెల్లమ్మతో ఇది యావత్తు చెప్పింది. చెల్లమ్మ గుండె కొట్టుకుంది.

తిరిగీ తాను యాథార్తిని బ్రతుకుతూంది నారాయణ వచ్చేవరకూ రోజులు లెక్కపెట్టుకుంటూ—తనపశువులూ, పొలం, పిల్లలు, తనఇల్లూ.—ఈచిన్ని ప్రపంచం తనది. ఈప్రపంచం తన్ని గౌరవిస్తుంది. తనబాల్యం తెలుసు. తానెవ్వరో తెలుసు. ఈచిన్ని ప్రపంచంలో తానొకతె—వేరు కాదు. ఈప్రపంచ మంతా తన్నెరుగును. తానా ప్రపంచానికి పొరుగు గాదు.

మరియొకనెల గడిచింది. ఇప్పటికి రెండునెల లయింది నారాయణవద్దనుంచి వుత్తరం వచ్చి.

యుద్ధం మాత్రం జరుగుతూనే ఉందని ప్రతి రోజూ తెలుస్తూనే ఉంది లక్ష్మికి రంగమ్మగారిద్వారా. కాని ఉత్తరం రాకపోడానికి కారణం ఏమిటో తెలియ లేదు. ఒకవేళ సెలవు తీసుకొని బయలు దేరాడేమో తిరిగి వచ్చెయ్యడానికని ఒక ఊహ కూడా పుట్టింది.

ఈసంవత్సరం ములక వస్తుం దన్నారు. ఆ గింజలు కొస్తా రాకపోతే పిల్లలూ, ముసలమ్మా, లక్ష్మి ఏం గావాలి? లక్ష్మి కృశిస్తోంది కొద్ది కొద్దిగా. ఇంతట్లో దాసు ఉత్తరం వేశాడు.

౧౫-౧౧-౩౯

బ్రసా

"దురదృష్టంవల్ల చాలా బలమైన గాయాలు తగిలి నారాయణను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పుడే రాయాలంటే చేతు లాడాయి కావు. ఇప్పుడు తప్పదు. రాత్రి మాపై అధికారిని అడిగాను. నిన్ననే ప్రాణం పోయిందని చెప్పాడు. దుఃఖపడి ఏమీ లాభం లేదు. పిల్లల సుఖం చూసి బ్రతకాలి. ముసలమ్మను జాగ్రత్తగా చూడాలి. ఎప్పటికయినా తప్పనిదే ఈచావు."

లక్ష్మి విరిగిపోయింది. చీకటి. అంధకారం. తాను చేయని పాపానికి శిక్ష అనుభవించింది.

ఇరుగుపొరుగువాళ్లు చాలా సహాయం చేశారు. లక్ష్మిప్రాణం నిలిచింది. ముసలమ్మ మనసు రాయిచేసుకొంది. రెండుసార్లు పొద్దు పొడిచింది. లక్ష్మికి తెలియదు.

మూడవనాడు తిరిగీ ఒకఉత్తరం.

౧౮-౧౧-౩౯.

బ్రసా.

"ఏనాటి పాపమో ఈవిధంగా అన్ని విధాలా బాధ అనుభవిస్తున్నాను. దాసు ఈవిధంగా నీకుఉత్తరం రాశానని నాతో చెప్పాడు. నాగుండెలు జారిపోయినై. తప్పు అతనిదీ కాదు. మా యజమాని తాగి నెంబరు పొరపాటు చెప్పాడు. నాకు స్పృహ తప్పిపోయాక ఆస్పత్రికి తీసుకొచ్చారు. నాలాంటి పరిస్థితులలోనే ఉన్న మరొకాయన మూడు రోజులక్రితం పోయాడు. నీనోముబలంవల్ల నేనిప్పటికి తేలాను. కాళ్లూ చేతులూ బాగానే ఉన్నాయి. వీలయినంత త్వరలో వచ్చేస్తాను."

"ఇంకా ఈవారం ఉంటుందేమో ఈయుద్ధం. రాజీ చేసుకునే టట్లు ఉన్నారట ఉభయ పక్షాల వాళ్లూ."

"పిల్లలు కళ్లకు కట్టినట్లున్నారు."

"అమ్మకి దండాలు."

ఈసారి నారాయణే రాశాడు లక్ష్మికి.

ఆమరునాడంతా స్వప్నంలో తిరిగినట్లు తిరిగింది లక్ష్మి. రోజులు గడుస్తూన్నాయి.

ములక రాలేదు. చేను పండి ఒరిగింది. నిండు పంట. పైఊళ్లవాళ్లు గట్టుమీదనుంచి వెళ్తూ ఒకమాటు పరకాయించి మరీ వెడుతున్నారు.

నారాయణ మళ్లీ రాశాడు. కొత్తసంగతులు ఏమీ లేవు. నారాయణ లేకుండానే కోతకూడా జరిగింది. కుప్ప లేశారు. నారాయణ దగ్గరనుంచి ఉత్తరం మళ్లీ రాలేదు. ఇంకా బహుశా బయలుదేరి

ఉన్నా ఈపాటికి ఓడలో ఉండాలి. ఎల్లాగా నురిపిడి అయ్యేటప్పటి కయినా రాడా మొదట చెప్పిన ప్రకారం?

నురిపిడి అయింది. పనిపాట లన్నీ అయ్యాయి. లక్ష్మి ఇంటినిండా ధాన్యం కూర్చింది. భర్తకోసం, సుఖంకోసం, ఎదురుచూస్తోంది.

నెల అయింది. ఏమీ జాబు లేదు, ఏకబుర్లూ తెలియటం లేదు. కోసినవడ్లు కోసినట్లే ఉన్నాయి. నారాయణ వచ్చి గరిసె కడతాడని నమ్మకంతో అది అల్లాగే ఉంచింది. నేడో రేపో రావాలి. ఆఖరికి ఉత్తరమైనా.

ఆనాడు పెండలాడే పనంతా తెముల్చుకొని కరణంగారి యింటికి వెళ్లింది. రంగమ్మగారు పెద్ద బ్బాయిగారు అరుగుమీద కూచున్నారు. ఎప్పటిలా ఇంగ్లీషుకాగితం వచ్చింది. ఒకతెల్లదొర గొప్పవిందు బల్లముందర ప్రముఖులతో మాట్లాడుతూ ఉన్నట్లు ఏదో బొమ్మ ఉంది. దాన్లో నారాయణ దగ్గిరనుంచి ఉత్తరం వచ్చినంత ఆదుర్దా కలిగింది లక్ష్మికి. రామమూర్తిగారిని అడగబోతోంది దానిలో సంగతులు. ఇంతలో రంగమ్మగారే పలకరించారు.

"ఏం! లక్ష్మీ! యుద్ధం అయిపోయిందట. అందరూ సమాధానపడి సంధి జేసుకొన్నారు. మన దేశంనుంచి వెళ్లిన పటాలా లన్నీ తిరిగీ పంపించేశారు. ఇంక రెండు వారాలలో మన నారాయణ కూడా వచ్చేస్తా డన్నమాట. బయలుదేరే డన్నమాట."

లక్ష్మి కండ్లు చుక్కల్లా మెరిశాయి. ఒక్క పరుగున ఇంటి కొచ్చింది. పిల్లల్ని పేరుపేరు వరసన పిల్చింది చెప్పింది, "నాన్న వస్తున్నాడు" అని. వీధి కేసి చూసి ఏడని ఆదుర్దాగా అడిగారు వాళ్లు.

"ఇం కేముంది. ఇంక పదిహేనురోజులు! ఓడలో ఉన్నారు."

అత్తగారికి చెప్పింది సంగ తంతా. చెల్లమ్మకి సముద్రమంత అంతులేని సంతోషం కలిగింది. బోసి ఒక్కమాటు ఇకిలించింది. కన్నకడుపు. ఆకాశము వైపు చూసింది. ఒక్కదణ్ణం పెట్టింది. పొంగి పొంగి వచ్చినై కళ్లల్లోకి నీళ్లు.

రాత్రి లక్ష్మి పడుకొంది. ఎప్పుడు తెల్లవారుతుందో అనిపించింది. తెల్లవారితే ఒక్కరోజు గడచిందన్నమాట. ఓడ మరికొంత దగ్గిర కొచ్చిఉంటుంది, ఇంకా పద్నాల్గుపొద్దులూ పద్నాల్గురాత్రుళ్లూ గడవాలి. పువ్వుల్లాంటి చక్కని కలలొచ్చాయి. ప్రకృతిలో సౌందర్యమంతా లక్ష్మిదే. సృష్టిలో ఇమిడిన ఆనందమంతా తనదే. ఆదినుంచి తుదివరకూ ఆనందమే కనిపించింది. ఒకప్పుడు తను అనుభవించిన దుఃఖం లక్ష్మి మరచిపోయింది. కష్టాలు తీరిపోయినవి. ఇహ జీవితంలో ఒకవెలితిలేని ఆనందం.

మరునాడు పొలంగట్టుమీద బెండకాయల కోసం వెళ్లి అటూ ఇటూ చూసి, చిన్నతనంలో తాను నేర్చుకున్న పాట మెల్లగా గొంతెత్తి పాడింది లక్ష్మి. పిల్లబోదులలో నీళ్లన్నీ ఎండిపోయినా అంగ లేసి దాటి వచ్చింది.

అత్తగారికీ పిల్లలకీ వడ్డించింది. నాన్న వస్తాడని ఊరించి మరొకముద్ద తినిపించింది రాముడికి. తనూ భోంచేసింది. పట్టెడన్నమే. కడుపు నిండింది. ఆకలికూడా లేదు.

సాయంకాలం సూర్యుడు అస్తమిస్తున్నాడు. పడమట కావిరి కమ్మింది. ఆవులు పొలంనుంచి తిరిగివచ్చినై. ఎఱ్ఱావు కోడెదూడ అల్లరిచేస్తో రాముడితో ఆడుకొంటోంది. లక్ష్మి సూర్యుడి కెదురుగా నీళ్ల కెడుతోంది. లక్ష్మినీడ పొడవుగా పడ్డది. రాముడు ఆడుకుంటూ నీడలో కొచ్చాడు. ఎదురుగా కాకీబట్టలు వేసుకొని ఒకమనిషి వచ్చి ఒక పెద్ద కాకీకవరు యిచ్చాడు.

ఇంకెవరు ఉత్తరం రాస్తారూ, నారాయణ తప్ప? కవరు కళ్ళ కద్దుకుంది. కొంగులో ముడివేసుకొని బిందె నింపుకొని ఇంటికి గాలిలో నడచి వచ్చింది.

ఇది విప్పి చదివించేవరకు తృప్తిలేదు. పిల్లల మాట అత్తగారిమాటా తరవాత. ముందర తాను వినాలి. ఏరోజు కారుకి దిగుతారో ధర్మవరం!

ఈ వుత్తరం ఏదో మామూలుకంటే భేదంగా వుంది. కాని ఇల్లాంటి కవర్లు ఇదివరకు కొన్నిమార్లు చూచినట్లు జ్ఞాపకం వచ్చింది. — కరణంగారి ఇంట్లో రంగమ్మగారి నడిగితే సర్కారు కాగితాలు, సర్కారు ఉత్తరాలు అని చెప్పింది. కనుక ఇదీ సర్కారుదేనేమో? సర్కారు కేంపని నాతో అనుకుంది లక్ష్మి. కాని వెంటనే అర్థమయింది. సర్కారు పొలాలు ఇస్తారుగా యుద్ధమయింతరవాత. ఆహుకుము అయి ఉంటుంది. ఎన్ని యకరా లిచ్చారో! చదవగలిగితే బాగుండును.

ఉత్తరంచదివి సర్కారు అన్నమాట రామ్మూర్తి గారు చెప్పాలి.

ఆ ఉత్తరం వళ్లోపెట్టుకొని చిరునవ్వుతో కరణంగారి యింటికి పరుగెత్తింది — లక్ష్మి.

రామమూర్తిగారు చదివారు — రెండవ రెజిమెంటు ౧౨౦ సెం. నారాయణ ఆఖరునాటి యుద్ధంలో పోయాడు. ఆతని కుటుంబానికి సర్కారు వారు కృష్ణాజిల్లా పోలవరంతాలూకా సెం. ౫/౭౫ అర్ సర్వేభూమి ౫ ఎకరాలు గ్రాంటుచేశారు.

---

# ఉగాదిభిక్షుకుఁడు

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

తలిరుల మెక్కిమెక్కి యెడఁదన్ నవరాగము లుప్పతిల్లఁ గొ
మ్మలపయి నాకుజొంపములమాటున దాఁగి కుహూ యటంచు కో
కిల గళ మెత్తి పాడఁ బులకించిన మానసవీథి నేవొ
తలఁపులు మూఁగ ద్వారసవిధమ్మున నిల్చితి చైత్రపాడ్యమిన్.

వాడిన తీగలెల్ల కనుపండువుగాఁ జిగురించి మున్ను నా
షాఢవినీలమేఘముల చల్లఁదనమ్మును దాఁచిదాఁచి యీ
నాఁడు వసుంధరన్ గురిసె నాహృదయమ్ము వసంతగీతికల్
బాడఁ దలంచుచుండ నొకరావము విన్పడె "బిక్ష మమ్మరో!

పండుగ, తల్లి! యీకడుపు భగ్గున నాఁకలి కోర్వఁజాలకన్
మండెడు, గుప్పెఁడన్నమయినన్ గబవయ్యెఁ, గృహాంతరంగవై
పండుగనాఁడు బిచ్చ మిడి భవ్యచరిత్రవు గమ్ము ధారుణీ
మండలి నింక దిక్కెవరు మాతరొ! యీ దురదృష్టజీవికిన్?